19.04.2026
ఆదివారం
www.bestvoicenews.com
bestvoice
# బెస్ట్ వాయిస్
తెలుగు దినపత్రిక
సంపుటి:10 | సంచిక : 302 | వెల:రూ 1/- వరంగల్ ఎడిటర్: కె.మోహన్‌రావు పేజీలు 07

# ముసుగు రాజకీయాలు వద్దు..

## మహిళా రిజర్వేషన్లపై కేంద్రంపై రేవంత్ రెడ్డి విమర్శలు

- బిల్లు వీగిపోవడం చిత్తశుద్ధి లోపమా?
- డిలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం?
- తక్షణ అమలు కోసం కాంగ్రెస్ సవాల్



బెస్ట్‌వాయిస్, స్టేట్‌బ్యూరో:
మహిళా రిజర్వేషన్ల అంశంపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్రంగా తూర్పారబట్టారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల బిల్లు వీగిపోవడం చట్టాల ఓటమి కాదని, అది మోదీ ప్రభుత్వ చిత్తశుద్ధికి జరిగిన ఓటమి అని వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో సీట్ల పెంపు (డిలిమిటేషన్), రిజర్వేషన్ల రద్దు వంటి ప్రయత్నాలను ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా అడ్డుకున్నాయని, ఇది బీజేపీ అహంకారానికి పట్టిన చెంపపెట్టు అని ఆయన పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లోనే ప్రజలు బీజేపీ కుట్రలను ఓడించారని, ఇప్పుడైనా పంతాలకు పోకుండా మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అడ్డంకి కాదని, తాము బిల్లుకు వ్యతిరేకం కాదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. “ఒక గంటలో చట్టాన్ని సవరిస్తామని అమిత్ షా గతంలో చెప్పారు కదా.. ఇప్పుడు మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టాన్ని తీసుకురండి, ఆ బిల్లు పాస్ అయ్యేలా కాంగ్రెస్ పార్టీ లీడ్ తీసుకుంటుంది” అని ఆయన సవాల్ విసిరారు. 2027లో జరిగే యూపీ అసెంబ్లీ ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లలోనే మహిళలకు కేటాయింపులు చేసేలా ఎటువంటి రాజ్యాంగ సవరణలు చేసినా తమ మద్దతు ఉంటుందని, కానీ జనాభా ప్రాతిపదికన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేలా సీట్ల పెంపును ముడిపెడితే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేంద్రం ఇచ్చిన పిలుపు మేరకు జనాభా నియంత్రణను పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలను అభినందించాల్సింది పోయి, సీట్ల సంఖ్య తగ్గించి శిక్ష వేయాలని చూడటం దుర్మార్గమన్నారు. సీట్ల పెంపు విధానంపై మోదీ ఎంచుకున్న పద్ధతికి తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల కోసం అవసరమైతే కొందరు మగవారి సీట్లను వదులుకోవాల్సి వస్తుందని, తన నియోజకవర్గం రిజర్వ్ అయినా తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఇదే క్రమంలో బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, లక్ష్మణ్ భజన రాజకీయాలు మాని రాష్ట్ర ప్రయోజనాల కోసం పని చేయాలని హితవు పలికారు. అలాగే, పార్లమెంట్ నిబంధనలపై అవగాహన లేకుండా మాట్లాడుతున్న తేజస్వి సూర్య వంటి నేతలకు కనీస జ్ఞానం కల్పించాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు.



## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు కరవు భత్యం (డీఏ)ను 2 శాతం పెంచుతూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో డీఏ 58 శాతం నుంచి 60 శాతానికి పెరగనుంది. ఈ పెంపు జనవరి నుంచి అమల్లోకి రానుంది. గ్రామీణ రహదారుల అభివృద్ధికి సంబంధించిన ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనను 2028 వరకు పొడిగించేందుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వచ్చే మూడేళ్లలో రూ.83,977 కోట్లు ఖర్చు చేసి వ్యవసాయ మార్కెట్లు, పాఠశాలలు, ఆసుపత్రులకు వెళ్లే రహదారులను అభివృద్ధి చేయనున్నారు. ఇక రైల్వే రంగంలో కూడా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాజమండ్రి-విశాఖపట్నం మధ్య అదనంగా రెండు రైల్వే లైన్ల నిర్మాణానికి రూ.9,889 కోట్లు మంజూరు చేశారు. నిడదవోలు-దువ్వాడ మధ్య ఈ లైన్లు నిర్మించనున్నారు. అలాగే గాజియాబాద్-సీతాపూర్ మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. అదనంగా సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటుకూ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.13 వేల కోట్లతో ఈ నిధిని ఏర్పాటు చేయనున్నారు. భారత జెండా ఉన్న నౌకలతో పాటు భారత్ నుంచి ప్రయాణించే నౌకలకు బీమా కవరేజీ కల్పించనున్నారు.

# తెలంగాణ రైతులకు శుభవార్త..

## రేపే ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు..

**ఏప్రిల్ 20న రెండో విడత రైతు భరోసా నిధులు.. ఎకరం కంటే ఎక్కువగా భూమి ఉన్న రైతులకు జమ..**

బెస్ట్‌వాయిస్, స్టేట్‌బ్యూరో:
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు సాగు పెట్టుబడి కష్టాలు తీర్చేందుకు మరో కీలక అడుగు వేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కార్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ‘రైతు భరోసా’ పథకానికి సంబంధించి రెండో విడత నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈనెల 20వ తేదీన రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1.50 కోట్ల ఎకరాల సాగు భూమికి ఈ పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. ఎకరానికి రూ. 6,000 చొప్పున రైతుల బ్యాంక్ ఖాతాల్లో ఈ నిధులు జమ కానున్నాయి. ఈ బృహత్తర కార్యక్రమాన్ని భూపాలపల్లి జిల్లా కాటారం వేదికగా నిర్వహించనున్నారు. అక్కడ జరిగే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రుల సమక్షంలో బటన్ నొక్కి నిధులను విడుదల చేస్తారు. రాష్ట్రంలోని సుమారు 73 లక్షల మంది రైతులకు మేలు చేకూర్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటికే గత నెల 23వ తేదీన మొదటి విడత సాయాన్ని విజయవంతంగా పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. తొలి విడతలో ప్రతి రైతుకు కనీసం ఒక ఎకరానికి సరిపడా పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందజేసింది.





కొడగాని మోహన్‌రావు
-ఎడిటర్
99633 34550

# చికెన్ వ్యాపారుల సంఘ నూతన కమిటీ ఏర్పాటు



బెస్ట్ వాయిస్,వరంగల్:

వరంగల్ అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో చికెన్ వ్యాపారులు ఐక్యంగా కలిసి సంఘాన్ని బలోపేతం చేసుకునే దిశగా నూతన కమిటీని ఘనంగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 40వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీర్జా అక్తర్ హాజరై సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చికెన్ వ్యాపారులు ఒకే వేదికపైకి వచ్చి సంఘంగా ఏర్పడటం చాలా శుభపరిణామమని పేర్కొన్నారు. వ్యాపారంలో పారదర్శకత ఉండాలంటే ప్రతి రోజూ ఒకే రేటును నిర్ణయించి ప్రజలకు నాణ్యమైన చికెన్ అందించడం చాలా ముఖ్యమని సూచించారు. వ్యాపారులు ఐక్యంగా పనిచేస్తే వినియోగదారుల నమ్మకం పెరుగుతుందని, అదే సమయంలో ధరలు కూడా నియంత్రణలో ఉండి అందరికీ అందుబాటులో ఉంటాయని అన్నారు. అలాగే ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ వ్యాపారం నిర్వహించాలన్నారు.ఇదే కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ కోదాటి అనిల్ కుమార్ పాల్గొని వ్యాపారులను అభినందించారు. సంఘం ద్వారా వ్యాపారుల సమస్యలను సమిష్టిగా పరిష్కరించుకోవచ్చని, భవిష్యత్తులో సంఘం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా అప్పాల సురేష్, ఉపాధ్యక్షుడిగా ఎండి అన్వర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రధాన కార్యదర్శిగా పూల పరమేశ్వర్, సహాయ కార్యదర్శిగా కోడెం రమేష్ నియమితులయ్యారు. కోశాధికారిగా ఎరుకొండ సురేష్ బాధ్యతలు చేపట్టారు.అదనంగా సంఘాన్ని మరింత చురుకుగా నడిపించేందుకు ఆర్గనైజర్లుగా ఎండి అజీజ్, నాంతబాజీ సందీప్, సామల సంతోష్, ఎండి కాజా తదితరులను ఎంపిక చేశారు. సంఘం అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని నూతన కమిటీ సభ్యులు సంకల్పం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రాంతానికి చెందిన చికెన్ వ్యాపారులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగి, సంఘం భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చలు జరిపారు.

# యమధర్మరాజు వేషంలో ట్రాఫిక్ అవగాహన

- **ట్రాఫిక్ నిబంధనలు పాటించండి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోండి**



బెస్ట్ వాయిస్,హనుమకొండ:

ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణను లక్ష్యంగా తీసుకుని నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా కాజీపేట ట్రాఫిక్ పోలీసులు శనివారం వినూత్న అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు.సుబేదారి అదాలత్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఆకర్షణగా యమధర్మరాజు, చిత్రగుప్తుడి వేషధారణలో రహదారులపై ప్రచారం చేపట్టారు. ఈ వినూత్న చర్య వాహనదారుల దృష్టిని ఆకర్షించి, హెల్మెట్ ధరించడం ఎంత ముఖ్యమో తెలియజేసింది. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించినప్పుడు ఎదురయ్యే ప్రమాదాల గురించి కూడా వివరించారు.ఈ సందర్భంగా అదనపు డీసీపీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు క్షణాల్లో ప్రాణనష్టం కలిగించే ప్రమాదకర సంఘటనలని తెలిపారు. వాటిని నివారించాలంటే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తమ ప్రాణ రక్షణకు అత్యంత అవసరమని, అలాగే కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలు ప్రజల భద్రత కోసం రూపొందించబడ్డాయని, వాటిని నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు పెరుగుతాయని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. "ప్రజలు క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడమే మా ప్రధాన లక్ష్యం. 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచి ప్రమాదాలను తగ్గించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాము" అని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్నతో పాటు ఇతర ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా బిల్లును (131 అమెండ్మెంట్ బిల్లు) నీరుగర్చిన కాంగ్రెస్

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడి**
- **ఇండి కూటమికి మహిళలు బుద్ధి చెబుతారు - డాక్టర్ వన్నాల వెంకట రమణ**




బెస్ట్ వాయిస్,వరంగల్:

భారత ప్రజాస్వామ్యంలో ఇదొక చీకటి రోజు. ప్రధాని నరేంద్ర మోదీ 33% రిజర్వేషన్లతో 'మహిళా నేతృత్వంలో అభివృద్ధి'కి బాటలు వేస్తుంటే, కాంగ్రెస్ మరియు 'ఇండి' కూటమి కుట్రపూరితంగా దానిని అడ్డుకుని తమ మహిళా వ్యతిరేకతను బట్టబయలు చేసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ దృష్టిలో మహిళలంటే కేవలం ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీలు మాత్రమే. డీలిమిటేషన్ సాకుతో, పార్లమెంట్ సాక్షిగా ప్రతి రాష్ట్రంలో మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి వర్యులు అమిత్ షా గారు సమావేశమై ప్రతి రాష్ట్రంలో 50% సీట్లను పెంచడం వలన అందరికీ సమన్యాయం జరుగుతుంది అని అన్నారు, కానీ వారికి ఘనత వస్తుంది అనే అక్కసుతో, ఎక్కడ మహిళలు చట్టసభల్లోకి అడుగుపెట్టి బిజెపికి క్రెడిట్ ఇస్తారో అన్న అక్కసుతో ఈ బిల్లును నిలిపివేయడం యావత్ మహిళా లోకానికి, వారి హక్కులకు జరిగిన ఘోర అవమానం. వారు వెంటనే మహిళా సోదరీమణులకు క్షమాపణలు చెప్పాలి డిమాండ్ చేసిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, రాష్ట్ర బి జె వై ఎం అధ్యక్షుడు కుండె గణేష్, శ్రీవర్ధన్ రెడ్డి మరియు వివిధ మహిళా మోర్చ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.



# అంగూర పండ్లతో ఆంజనేయ స్వామి అలంకరణ



బెస్ట్ వాయిస్,హన్మకొండ:

హన్మకొండ పద్మాక్షి కాలనీలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం భక్తి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్వామివారికి 108 కిలోల అంగూర పండ్లతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరుట్ల రామాచార్యులు అర్చనలు చేసి, విశేష పూజలు నిర్వహించారు.అలాగే శనివారం రోజు 300 మంది హనుమాన్ దీక్ష స్వాములు అర్ధ మండల దీక్షలో భాగంగా మాలధారణ చేశారు. ఈ విషయాన్ని అన్నదాన కమిటీ అధ్యక్షులు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కర్రు దశరథ్ కుమార్, మొగిలి గండ్రతి సుధాకర్, సత్యం, శంకర్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు భారీగా హాజరై స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు.



# తెలంగాణ జాగృతి పార్టీలో చేరిన చాకలి ఐలమ్మ వారసులు

బెస్ట్ వాయిస్,తొర్రూరు:

తెలంగాణ జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి నలమాస శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన చాకలి ఐలమ్మ వారసులు సట్ల పద్మ మరియు వారి చెల్లెలు జ్యోతిలు శనివారం తెలంగాణ జాగృతి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం చాకలి ఐలమ్మ వారసులు మాట్లాడుతూ...కవితక్క పోరాటాన్ని చూసి మేము జాగృతి పార్టీలో చేరామని, నాడు భూస్వాములకు, రజాకారులకు ఎదురొడ్డి పోరాటం చేసిన మా అమ్మమ్మ చాకలి ఐలమ్మ ప్రతీకగా కవితక్క కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతుందని తెలిపారు.



# అరైవ్ అలైవ్ ప్రచారంలో గీసుగొండ సీఐ

బెస్ట్ వాయిస్,గీసుగొండ(వరంగల్):

రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" ప్రచార కార్యక్రమం 6వ రోజు సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మామ్నూర్ ఏసీపీ తో కలిసి గీసుగొండ సీఐ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ చాంపియన్ 2026 స్టిక్కర్లను వాహనదారులకు పంపిణీ చేసి, వాటిని వివిధ రకాల వాహనాలపై అతికించారు.ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు నియమాలు పాటించడం, బాధ్యతాయుతంగా వాహనాలు నడపడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.అలాగే కోనాయిమకుల గ్రామ పంచాయతీ కార్మికులకు హెల్మెట్లను పంపిణీ చేసి, భద్రతతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి స్థానికులు, వాహనదారులు మంచి స్పందన తెలియజేశారు.



# బాల్య వివాహాలను అరికట్టి వేధింపులను నియంత్రించాలి

- సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్

బెస్ట్ వాయిస్,మిర్యాలగూడ:

బాల్యవివాహాలుఅరికట్టి , బాలికలపై జరుగుతున్న వేధింపులను నియంత్రించేం దుకు ప్రజలను చైతన్య పర్చాల్సిన సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్ అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేట్, జిల్లా సంక్షేమ అధికారిణి ఆదేశాల మేరకు శనివారం మిర్యాలగూడ సబ్ కలెక్టరేట్ లో సబ్ కలెక్టర్ అమిత్,ఐసిడిఎస్,మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత, దామరచర్ల ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్. చంద్ర కళ లతో కలిసి బాల్య వివాహాలు అక్రమ దత్తత, ఫోక్సో చట్టాలపై అవగాహన పోస్టర్లనుఅయనఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలునిండినతర్వాత మాత్రమేవివాహాలుచేయాలన్నారు.18 ఏళ్ల లోపు చేస్తే చట్టరీత్యానేరమవుతుందన్నారు.ఈకార్యక్రమంలోఐసిడిఎస్ దామరచర్ల పీఓ ఎన్.చంద్రకళ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ అధికారు లు వెంకన్న, రమణి మహేష్, సూపర్వైజర్లు హేమాదేవి, నాగమణి, వాణి,పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్: టీ.కవిత తదితరులు పాల్గొన్నారు.



# ఆలగడప అంగన్వాడీలో పోషణ పక్వాడ

బెస్ట్ వాయిస్,మిర్యాలగూడ:

పోషణ పక్వాడ కార్యాచరణ ప్రణాళికలో భాగంగాశనివారం మిర్యాలగూడ ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని ఆలగడప సెక్టార్, ఆలగడప అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఓ రేఖల మమతఆదేశానుసారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎస్.రాధికపాల్గొనిమాట్లాడుతూ0-6 సంవత్సరాల పిల్లల పోషణ, ఆరోగ్యం, మెదడు అభివృద్ధి మెరుగుపరచడంలో ముఖ్యంగా తండ్రులు, సంరక్ష కులు పిల్లల ఎదుగుదలలో చురుకుగా పాల్గొనాలన్నారు.అంగన్వాడీ కేంద్రాలను క్రీడల ఆధారిత బోధన కేంద్రాలుగా బలోపేతంచేస్తున్నామన్నారు. స్థానిక వస్తువులతో బొమ్మలు తయారు చేసి చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యను అందిస్తున్నామన్నారు.0-6 సంవత్సరాలు కీలకమని పెద్దలు పిల్లలతో కలిసిమాట్లాడటం, పాటలు పాడటం, కథలు చెప్పడం ప్రేమతో స్పందించడం ఇలా చేస్తేమెదడు అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు.ఈ కార్య క్రమంలో అంగన్వాడీ టీచర్లు మణెమ్మ సైదాబీ, అరుణ, గర్భిణీలు, బాలింతలు, తల్లులు,సంరక్షకులుతదితరులు పాల్గొన్నారు.



# స్కూల్లలో ఫీజురాయితీ పొందిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

బెస్ట్ వాయిస్,మిర్యాలగూడ:

6, 7, 8, 9వ తరగతుల విద్యార్థులు మెరిట్ స్కాలర్ షీప్ కోసం జీవీర్ ఐఐటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెరిట్ స్కాలర్ షీప్ టెస్టు నిర్వహించడం జరిగింది. టెస్టు లో పాల్గొన్న 25 మంది విద్యార్థులలో 20 మంది విద్యార్థులు 100శాతం , 70శాతం , 60శాతం , 50శాతం 40శాతం ఫీజు రాయితీకి ఎంపికయ్యారు. జీవీఆర్ ఐఐటీ ఫౌండేషన్ డైరెక్టర్ కరస్పాండెంట్ వెంకటరావులతో కలిసి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ఎంపికైన విద్యార్థులకు అడ్మిషన్ ఫామ్స్ ఇచ్చారు. సెలెక్ట్ అయిన విద్యార్థుల తల్లిదండ్రులకు శుభాకాంక్షలుతెలిపారు. పిల్లలకు ఆల్ ద బెస్ట్ చెబుతూ ఈ విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, 39 వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ సలీం, నల్గొండ జిల్లా ఎన్ఎస్ఐయు అధ్యక్షుడు మహమ్మద్ ఆరిఫ్, బిఎల్ఆర్ బ్రదర్స్ ఫౌండేషన్ చైర్మన్ సాయి ప్రసన్న ప్రజాప్రతినిధులు విద్యార్థిని విద్యార్థులకు తల్లిదండ్రులకు శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు.

# ఇంట్లోని క్యాన్సర్ కారకాల తో జాగ్రత్తగా ఉండాలి

- రోజూ వాడే 10 వస్తువులతో పెను ప్రమాదం
- డా.మహమ్మద్.నిసార్ అహమ్మద్

బెస్ట్ వాయిస్,మాడ్గులపల్లి:





మనం మన ఇంటిని అత్యంత సురక్షితమైనప్రదేశంగాభావిస్తాం.కానీ,మనకుతెలియకుండానే మనంరోజూఉపయోగించే కొన్ని వస్తువులు దీర్ఘ కాలం లో ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధి కి దారితీసే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూ హెచ్ ఓ, తో పాటు నేషనల్ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ వంటి సంస్థలు హెచ్చరిస్తున్నాయని నల్లగొండ జిల్లా,మాడ్గులపల్లిమండలం ,తోపుచర్ల గ్రామానికి చెందిన డా. మహమ్మద్ నిసార్ అహమ్మద్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇల్లు సువాసన రావాలని మనం మనం నిత్యం వినియోగించే రూమ్ ఫ్రెషనర్లు 'వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్లు ' (విఓసిఎస్) విడుదల చేస్తాయని ఇందులో ఉండే ఫార్మాల్డిహైడ్ అనే రసాయనం క్యాన్సర్ కారకమని శాస్త్రీయంగా నిరూపితమైందన్నారు.అదేవిధంగా సువాసన ముఖ సౌందర్యం కోసం ప్రతిరోజు వినియోగించే టాల్క్ అనేది సహజఖనిజమేఅయినప్పటికీ, అందులో 'ఆస్బెస్టాస్' అనే క్యాన్సర్ కారక పదార్థం కలిసే అవకాశం ఉందని . పౌడర్ ను దశాబ్దాల పాటు నిరంతరం వాడటం వలన అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధనా సంస్థ (ఐఏఆర్ సి) సూచిస్తోందన్నారు.సువాసన ఇచ్చే కొవ్వొత్తులు వెలిగినప్పుడు వెలువడే సూక్ష్మ కణాలు (పీఎం 2.5) ఊపిరితిత్తుల్లోకి చేరి అక్కడ పేరుకుపోతాయని . ఇవి క్యాన్సర్ తో పాటు ఇతర శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతాయని కొన్ని అధ్యయనాలుచెబుతున్నాయన్నారు. వంట గదిలో వినియోగించేనాన్ స్టిక్ పాత్రల నుఅధిక వేడిచేసివాడినప్పుడు,వాటి కోటింగ్ లో వాటి కోటింగ్లో పి ఎఫ్ ఓఏ (పెర్ఫ్లూరూక్టనోక్ ఏసీడ్) అనే రసాయనంవిడుదలవుతుంది.ఇది జంతువులపై జరిపిన ప్రయోగాలలో క్యాన్సర్ కు కారకమని తేలిందన్నారు . కాబట్టి వీటిని ఎప్పుడూ తక్కువ లేదా మధ్యస్థ వేడి మీదమాత్రమే వాడాలని డా. నిసార్ అహమ్మద్ సూచించారు. మనం నిత్యం ఇంట్లో వాడే ఒక్క దోమల బిళ్ల వెలిగించడం వల్ల వెలువడే పొగ డజన్ల కొద్దీ సిగరెట్ల పొగతో సమానమని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పేర్కొందన్నారు. ముఖ్యంగా గాలి ఆడని గదుల్లో వీటిని వాడటం అత్యంత ప్రమాదకరమని అయన తెలిపారు. హెయిర్ డైలలో ఉండే 'ఆరోమాటిక్ అమైన్స్' వంటి రసాయనాలు క్యాన్సర్కు దారితీసే అవకాశం ఉందని . అప్పుడప్పుడు వాడటం వల్ల పెద్దగా ఇబ్బంది లేకపోయినా, ఏళ్ల తరబడి వాడటం ప్రమాదకరమని అయన హెచ్చరించారు.బట్టల మధ్య ఉంచే ఈ గోళీలు నాఫ్తలీన్, పారాడిక్లోరోబెంజీన్ అనే వాయువులను విడుదల చేస్తాయని,గాలి ఆడని గదులలో ఇవి మన శరీరంలోకి చేరే అవకాశం ఉందన్నారు.ప్లాస్టిక్ పాత్రలు, పాలిథిన్ బ్యాగులు వాడడం తో అందులోని బిపిఎ, థాలెట్స్ వంటి రసాయనాలు ఆహారంలోకలుస్తాయన్నారు . ఇవి శరీరంలోని హార్మోన్ల వ్యవస్థనుదెబ్బతీసిక్యాన్సర్ కు కారణమవుతాయని తెలిపారు. మన ఇంటిలో ప్రతిరోజు వినియోగించే డిటర్జెంట్లు, క్లీనింగ్ ప్రొడక్టర్లు క్లీనింగ్ స్ప్రేలలో అమ్మోనియా, క్లోరిన్ వంటి ఘాటైన రసాయనాలు ఉంటాయని వీటిని తరచుగా పీల్చడం వల్ల ఊపిరితిత్తులుదెబ్బతింటాయని యూరోపియన్ రెస్పిరేటరీ సొసైటీ హెచ్చరించిందన్నారు.ఈవస్తువులనువాడినవెంటనే క్యాన్సర్ రాదు. కానీ, వీటిలో ని రసాయనాలకు దశాబ్దాల పాటు గురికావడం వల్ల ప్రమాదం పొంచి ఉందని అవగాహన పెంచుకుని, సాధ్యమైనంత వరకు సహజసిద్ధమైన ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడమే ఉత్తమ మార్గమని డా.మహమ్మద్ నిసార అహ్మద్ తెలిపారు.






# ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ను విజయవంతం చేయాలి

బెస్ట్ వాయిస్,మిర్యాలగూడ:

మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం విజయవంతం చేయాలని మునిసిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్ కోరారు. శనివారం మునిసిపల్ మీటింగ్ హాలులో ఉద్యంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ మాట్లాడుతూ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తో చిన్న వ్యాపారులు పొందగల ప్రయోజనాల గురించి వివరించారు. టీఎంసీ మెప్మా పి.బక్కయ్య మాట్లాడుతూ మహిళా సంఘాల పాత్రను వివరించారు.స్థానిక వ్యాపారులకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలన్నారు.ఈడీసీ మేనేజర్ జి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ విధానం, అవసర పత్రాలు, ప్రయోజనాలను తెలిపారు. ఈడీసీ అసిస్టెంట్ మేనేజర్ పి. హార్షవర్ధన్ కార్యక్రమాన్ని సమన్వయం చేసి మార్గదర్శకత్వం చేశారు.ఈ కార్యక్రమంలో మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎం.శ్రీనివాస్, డిఇఓ సతీష్, టీఎల్ఎఫ్ అధ్యక్షులు అరుణ, అనిత, ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షులు, సోమీదేవి, పాశం పద్మ, మెప్మా ఆర్పిలు చంద్రకళ, అనిత, ఝాన్సీ, లక్ష్మి మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# హెల్మెట్ ధారణపై ప్రత్యేక దృష్టి

- అరైవ్ అలైవ్ క్యాంపెయిన్‌లో అవగాహన కార్యక్రమం




రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ARRIVE ALIVE క్యాంపెయిన్ 4వ దశలో భాగంగా 6వ రోజు కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఎస్సై సాంబయ్య మరియు పోలీసు సిబ్బంది కలిసి KMC క్రాస్ రోడ్ పరిధిలో విస్తృత స్థాయిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ముఖ్యంగా హెల్మెట్ ధరించని రెండు చక్ర వాహనదారులపై ప్రత్యేక దృష్టి సారించారు. హెల్మెట్ ప్రాముఖ్యతను వారికి వివరిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించారు. అవగాహనను ఆకర్షణీయంగా మార్చేందుకు వాహనదారులకు “విశిష్ట శిరస్త్రాణధారుడు”, “రోడ్ రోమియో”, “అసుర శిరస్కుడు” వంటి బిరుదులు అందజేశారు. అంతేకాకుండా ఎల్లప్పుడూ హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని వారితో ప్రమాణం చేయించారు.అదనంగా, లోటస్ స్కూల్‌కు చెందిన బస్సులను తనిఖీ చేసి అవసరమైన పత్రాలను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలు సక్రమంగా పాటిస్తున్నారో లేదో పరిశీలించి, సంబంధిత సిబ్బందికి సూచనలు ఇచ్చారు. మైనర్ డ్రైవర్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించి, అప్రాయ వయస్సులో వాహనాలు నడపడం వల్ల కలిగే చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించడమే కాకుండా, బాధ్యతాయుత డ్రైవింగ్ అవసరాన్ని పోలీసులు స్పష్టం చేశారు.





# 32వ డివిజన్‌లో నూతన పారిశుద్ధ్య ట్రాక్టర్ పూజా

బెస్ట్ వాయిస్,వరంగల్:

నగరంలోని 32వ డివిజన్‌లో నూతన పారిశుద్ధ్య ట్రాక్టర్ పూజా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ పల్లం పద్మా రవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ, డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తడి చెత్త, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించే విధానం గురించి ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజల సహకారం ఉంటే డివిజన్‌ను పరిశుభ్రంగా, ఆదర్శంగా తీర్చిదిద్దడం సాధ్యమని పేర్కొన్నారు.రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మురళీధర్ మరియు మేయర్ సహకారంతో డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఈ ప్రాంతాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆమె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పూజారి పాలకుర్తి ఆంజనేయ శర్మ, ఆకారపు శశిధర్, పోరండ్ల ఓం ప్రకాష్, బుద్ధారం సాంబయ్య, దొరం ఆనంద్, కొండ సూరి రవి, కోదాటి సురేష్, ఇన్స్పెక్టర్ రాజు, జవాన్ కిరణ్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

# అరైవ్ అలైవ్ ప్రచారంలో రహదారి భద్రతపై అవగాహన

- ప్రమాద సమయంలో ప్రాణరక్షణపై సీపీఆర్ డెమో
- ట్రాఫిక్ నియమాలు పాటించాలి పరకాల ఏసీపీ సతీష్ బాబు



బెస్ట్ వాయిస్, ఆత్మకూరు:

రహదారి ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రాష్ట్ర పోలీసు శాఖ చేపట్టిన అరైవ్ అలైవ్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం ఆత్మకూరు కేంద్రంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆత్మకూరు పోలీస్ అధికారులు,సిబ్బందితో కలిసి పరకాల ఏసిపి సతీష్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే, సీట్ బెల్ట్ లేకుండా కార్లు నడిపితే ప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయో ప్రత్యక్ష ప్రదర్శన (లైవ్ డెమో) ద్వారా ప్రజలకు వివరించారు. రహదారి ప్రమాదాల సమయంలో ప్రాణాలను ఎలా కాపాడాలో తెలియజేస్తూ అత్యవసర పరిస్థితుల్లో చేయాల్సిన ప్రాథమిక చికిత్స విధానాలపై 108 అంబులెన్స్ వైద్యుడి సహాయంతో సీపీఆర్ (గుండె పునరుద్ధరణ పద్ధతి) ప్రదర్శన కూడా నిర్వహించారు.అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఐదు హెల్మెట్లను పంపిణీ చేశారు.అలాగే జాతీయ రహదారి 163 పై రహదారి భద్రతను ప్రోత్సహించే రెండు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా హెల్మెట్ ధరించడం తప్పనిసరి అనే సందేశంతో ర్యాలీ నిర్వహించగా, పరకాల ఏసిపి సతీష్‌బాబు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రహదారి నియమాలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రమాదంలో ఉన్నవారిని రక్షించే వారికి ప్రభుత్వం అందించే "రహవీర్ రివార్డు పథకం" గురించి వివరించారు.అదనంగా ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, వేగ పరిమితులను గౌరవించడం, పాఠశాల బస్సుల భద్రత, డ్రైవర్లలో బాధ్యతాయుతమైన ప్రవర్తన, పాఠశాల ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సిఐ ఆర్ సంతోష్, ఎస్సై తిరుపతి, పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు ,వాహనదారులు పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం

బెస్ట్ వాయిస్, ఆత్మకూర్ :

భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.ఈ కార్యక్రమ సందర్భంగా మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి, సాధికారత కోసం 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు ను ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశపెడితే కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు అందరూ కలిసి మహిళా బిల్లును అడ్డుకుని బిల్లు పాస్ కాకుండా ద్రోహం చేసారని,పార్లమెంట్ సాక్షిగా మహిళల ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరించింది అని తెలిపారు. మహిళలకు కాంగ్రెస్ పార్టీ నమ్మక ద్రోహం చేసింది అని,దేశ చరిత్ర లో నిన్నటి రోజు బ్లాక్ డే అని తెలిపారు.చట్ట సభల్లో మహిళల ప్రాతినిథ్యాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకుని మహిళాలోకానికి తీవ్ర అన్యాయం చేసింది అని, వెంటనే కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి నేతలు క్షమాపణలు చెప్పాలని కోరారు.ప్రధాని నరేంద్ర మోడీ గత కొన్ని రోజులుగా 33శాతం మహిళా మహిళా బిల్లు ను అమోదింపజేసి,మహిళలను చట్ట సభల్లో అడుగు పెట్టించి నారీ శక్తి ని భారత్ అభివృద్ధి లో భాగస్వాములు చేయడానికి ప్రయత్నాలు చేస్తుంటే మహిళల అభివృద్ధి ని ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి నేతలు మహిళా బిల్లును అడ్డుకుని తాము మహిళా ద్రోహులమని మరోసారి నిరూపించుకున్నారని తెలిపారు.మహిళా లోకం మొత్తం ఏకమై కాంగ్రెస్ పార్టీ ని దేశంలో లేకుండా తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు వేములపల్లి శ్రీలత,మాజీ మండల అధ్యక్షులు ఇరసడ్ల సదానందం,ప్రధాన కార్యదర్శి బయ్య పైడి,పీసాల సాంబయ్య,మండల కార్యదర్శి తిప్పని రాంబాబు,భూత్ అధ్యక్షులు కుక్కముడి కిరణ్,అల్లి మహేందర్, కుక్కల కుమార్ స్వామి,రాకేష్ పిట్టల స్వామి,గడ్డి ఐలయ్య,బొళ్ల రమేష్,బూర రామనాథం,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి విస్తృత సమావేశానికి తరలి వెళ్ళిన ఉద్యమకారులు

బెస్ట్ వాయిస్, ఆత్మకూర్:

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్రస్థాయి విస్తృత కార్యకర్తల సమావేశం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ అధ్యక్షతన హైదరాబాద్ తార్నాకలోని కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్ లో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఆత్మకూరు,దామెర మండలల నుండి ఉద్యమకారులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ తో భవిష్యత్ కార్యాచరణ భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ సమావేశానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్సడ్ల సదానందం,ఆత్మకూరు మండల అధ్యక్షులు ఎండీ బాబు మియా (చిరు),పోలేపాక ఆరోగ్యం ప్రధాన కార్యదర్శి గడ్డం సదానందం, మండల ఉపాధ్యక్షులు తోట బాబురావు,కుంటమల్ల రాజు, ఇటిక్యాల బాబురావు,గడ్డం రమేష్,పోలేబోయిన ప్రభాకర్, బలభద్ర కిషోర్,దండు భాస్కర్, భాషబోయిన సాగర్,మంద రవి, పెరుక వేణు,సారా రాజు,శోభన్ బాబు,వంగర సమ్మయ్య,బలబద్ర రాజేందర్, పెరుమాండ్ల స్వామి, అడిదెల రామచంద్ర రెడ్డి,నాగేల్లి స్వామి,నత్తి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



# మొక్కజొన్న కొనుగోళ్లు కేంద్రాన్ని పరిశీలించిన సర్పంచ్ శంకర్

బెస్ట్ వాయిస్, పర్వతగిరి:

పర్వతగిరి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోళ్లు ఆలస్యంగా జరుగుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం సర్పంచ్ చీదురు శంకర్ దృష్టికి రావడంతో ఆయన స్వయంగా కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. మండల పరిధి గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల రైతులు అధిక సంఖ్యలో మొక్కజొన్నను మార్కెట్ యార్డుకు తరలించడంతో యార్డు పూర్తిగా నిండిపోయిన పరిస్థితి నెలకొంది. ఒక్కరోజులోనే దాదాపు 8 వేల బస్తాలు మార్కెట్‌కు చేరుకున్నప్పటికీ, సరిపడా కొనుగోళ్లు జరగకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. మార్కెట్‌లో ఇప్పటికే ఉన్న మొక్కజొన్నకు కాంటాలు నిర్వహించాలంటే కనీసం 40 వేల బస్తాల సామర్థ్యం అవసరమని సమాచారం. ఈ నేపథ్యంలో సర్పంచ్ చీదురు శంకర్ సమస్యను ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మరియు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు తీసుకుని కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆయన కోరారు. మరోవైపు రైతులు కూడా కొనుగోళ్లు త్వరితగతిన నిర్వహించాలని, ఆలస్యం వల్ల నష్టాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మార్కుఫెడ్ సిఈఓ సురేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె దావఖానను పరిశీలించిన నీరుకుళ్ళ సర్పంచ్ నీరజ శ్రీనివాస్

బెస్ట్ వాయిస్, ఆత్మకూర్ :



రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకతగా చేపట్టిన 99 ప్రజా పాలన ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమాలు నీరుకుల్ల గ్రామ సర్పంచ్ తడక నీరజ శ్రీనివాస్ గౌడ్ గ్రామంలో ఉన్న పల్లె దావఖాన ను ఆకస్మికంగా తనిఖీ చేసి అందులో ఉన్న సిబ్బంది కలిసి గ్రామ ప్రజలకు సరియైన వైద్యం అందించి పల్లె ప్రజలను ఆరోగ్యంగా చూసుకోవాలని వారికి సూచించారు .ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు తడక ఉమా, మేడ పూలమ్మ, అక్కల లావణ్య వంగేటి అరుణ,,ఏఎన్ఎం సిరిమిళ్ళ మమత ,సిబ్బంది పాల్గొన్నారు.



# నాచారం వేదికగా దళిత రత్నుల సన్మానం

- **హెచ్.ఆర్. మోహన్ ఆధ్వర్యంలో వేడుక**

బెస్ట్ వాయిస్, ఉప్పల్:
ఉప్పల్ నియోజకవర్గం నాచారంలో హెచ్.ఆర్. మోహన్ నేతృత్వంలో దళిత రత్న అవార్డు గ్రహీతలకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు భారీగా హాజరయ్యారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా అవార్డు పొందిన పలువురు సామాజిక సేవకులను సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్.ఆర్. మోహన్ మాట్లాడుతూ, అవార్డు గ్రహీతలు సమాజానికి మార్గదర్శకులని, అణగారిన వర్గాల అభ్యున్నతికి వారి సేవలు ఆదర్శప్రాయమని అన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# యూఎస్ ట్రేడ్ డీల్‌కు వ్యతిరేకంగా ధర్నాకు రేవల్లి యూత్ కాంగ్రెస్ తరలింపు

బెస్ట్ వాయిస్ రేవల్లి వనపర్తి ;
కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న యూఎస్ ట్రేడ్ డీల్ చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని మండల యూత్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఒప్పందం దేశ ప్రయోజనాలకు విఘాతమని ఆరోపిస్తూ హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన ధర్నాకు రేవల్లి నుంచి యూత్ కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేష్‌తో పాటు సుబాహన్, సుధాకర్ యాదవ్, రమేష్, రాజేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.






# సిక్సర్ల శబ్దాల్లో మునిగిపోయిన కలలు






- **ఐపీఎల్ బెట్టింగ్ ఉచ్చులో యువజీవితాల విలాపం**
- **ఆటపై మోజు... జీవితంపై నిర్లక్ష్యం**
- **ఒక రూపాయి ఆశ... లక్షల నష్టం**
- **అప్పుల భారంతో కూలిపోతున్న కుటుంబాలు**
- **ప్రభుత్వ శాఖల కఠిన చర్యలతోనే నియంత్రణ**
- **మ్యాచ్ ముగుస్తుంది... కానీ నష్టం మిగిలిపోతుంది**
- **బెస్ట్ వాయిస్ దినపత్రికలో ఐపీఎల్ సీజన్ స్పెషల్ స్టోరీ...**

బెస్ట్ వాయిస్ రేవల్లి వనపర్తి ;
ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఐపీఎల్ సీజన్ సందడి నెలకొంది. ప్రతి వీధిలో, ప్రతి ఇంట్లో, ప్రతి మొబైల్ ఫోన్‌లో క్రికెట్ జోష్ కనిపిస్తోంది. అభిమానులు తమ ఇష్ట జట్లకు మద్దతు తెలుపుతూ మ్యాచ్‌లను ఆస్వాదిస్తున్నారు. కానీ ఇదే ఉత్సాహం మరోవైపు అనేక కుటుంబాల్లో కన్నీటి కథలకు కారణమవుతోంది. ఐపీఎల్ పేరుతో జరుగుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్, అక్రమ పందేలు కొంతమంది యువతను నెమ్మదిగా ప్రమాదకర మార్గంలోకి లాగుతున్నాయి. సరదాగా మొదలైన అలవాటు, తర్వాత వ్యసనంగా మారి జీవితాలను నాశనం చేస్తోంది. మొదట వంద రూపాయలతో మొదలైన పందెం, తర్వాత వేల రూపాయలకు చేరుతోంది. ఒకసారి గెలిస్తే మళ్లీ గెలుస్తామని, ఓడితే తిరిగి సంపాదిస్తామని యువత భ్రమలో పడుతోంది. చేతిలో ఉన్న మొబైల్ ఫోన్ ఆశ చూపుతుంది, కానీ చివరికి అప్పుల బారిన పడేస్తోంది. తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన డబ్బు క్షణాల్లో మాయమవుతోంది. ఇంట్లో అబద్ధాలు చెప్పడం, స్నేహితుల వద్ద అప్పులు చేయడం, వడ్డీ వ్యాపారుల ఒత్తిడులు ఎదుర్కోవడం, చివరకు మానసిక ఆందోళనలో కూరుకుపోవడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి.ఇంకా దారుణం ఏమిటంటే, నష్టాలను భరించలేక కొందరు యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు సమాజాన్ని కలవరపెడుతున్నాయి. తమ పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడిన తల్లిదండ్రులు, చివరకు వారి ఫోటో ముందు కన్నీళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. “మా బిడ్డ తప్పు చేశాడు... కానీ తిరిగి వస్తాడనుకున్నాం” అని విలపించే కుటుంబాల బాధ వర్ణనాతీతం. ఒక కుటుంబం మాత్రమే కాదు, ఆ ఇంటి ఆశలు, కలలు, భవిష్యత్తే ఒక్కసారిగా కూలిపోతున్నాయి.దీనిని అరికట్టాలంటే సంబంధిత శాఖలు వెంటనే కఠిన చర్యలు చేపట్టాలి. పోలీసులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి అక్రమ బెట్టింగ్ నిర్వాహకులు, మధ్యవర్తులు, ప్రచారం చేసే వారిపై కఠిన కేసులు నమోదు చేయాలి. సైబర్ క్రైమ్ విభాగం ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుకోవాలి. బ్యాంకులు, డిజిటల్ చెల్లింపు సంస్థలు అనుమానాస్పద భారీ లావాదేవీలను గుర్తించి సమాచారం అందించాలి. విద్యాశాఖ కళాశాలలు, పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు ఈ ముప్పు గురించి వివరించాలి. మానసిక నిపుణులతో కౌన్సిలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులకు సహాయం అందించాలి.తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించాలి. రాత్రిళ్లు ఎక్కువసేపు ఫోన్ వాడటం, డబ్బు కోసం ఒత్తిడి చేయడం, ఒంటరిగా ఉండడం, ఆందోళనలో కనిపించడం వంటి సంకేతాలను నిర్లక్ష్యం చేయకూడదు. మందలించడం కంటే ప్రేమగా మాట్లాడి సరైన దారిలో నడిపించాలి. స్నేహితులు కూడా తమ మిత్రులను ఈ అలవాట్ల నుంచి బయటకు తీయడానికి సహకరించాలి. ఐపీఎల్ ఒక ఆట మాత్రమే. ఆటగాళ్లు ఓడినా మళ్లీ ఆడతారు. జట్లు ఓడినా మళ్లీ గెలుస్తాయి. కానీ బెట్టింగ్‌లో ఓడిపోయిన యువజీవితం తిరిగి రాదు. క్షణిక ఆశ కోసం శాశ్వత నష్టాన్ని ఆహ్వానించకండి. యువత ఆటను ఆస్వాదించాలి గాని, భవిష్యత్తును పందెంగా పెట్టకూడదు. ప్రభుత్వం, కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి కదిలితేనే ఈ ప్రమాదాన్ని కొంతవరకు అరికట్టవచ్చు. లేదంటే ప్రతి సిక్సర్ వెనుక మరో ఇంటి కన్నీటి కథ దాగి ఉండే ప్రమాదం ఉంది.





# మహిళా శక్తికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- **ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

బెస్ట్ వాయిస్,హన్మకొండ:
హన్మకొండలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (DCC) భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళా కాంగ్రెస్ సమీక్షా సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న “మహాలక్ష్మి” పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి సౌకర్యాలు అందిస్తూ వారి ఆర్థిక భారం తగ్గిస్తున్నామని చెప్పారు. ఈ పథకం వల్ల రాష్ట్రవ్యాప్తంగా మహిళలు గణనీయంగా ఆదా చేసుకుంటున్నారని పేర్కొన్నారు.అలాగే స్వయం సహాయక సంఘాల (SHG) మహిళలకు వడ్డీ లేని రుణాలు, వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తూ మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇందిరా గాంధీ కాలం నుంచే కాంగ్రెస్ పార్టీ మహిళలకు రాజకీయాల్లో ప్రాధాన్యత ఇస్తోందని, స్థానిక సంస్థల నుంచి పార్లమెంట్ వరకు మహిళల ప్రాతినిధ్యం పెరగాలని ఆకాంక్షించారు.క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి మహిళా కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చిన ఆయన, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మహిళా కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాలని సూచించారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీలేని చర్యలు తీసుకుంటోందని, వేధింపులపై కఠినంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజలకు ప్రాంతీయతపై మక్కువ ఎక్కువ



GUEST COLUMN



మహమ్మద్ ఫయాజ్
9701045096.

తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది అంటే ఎంతకైనా తెగించే సత్తా వెన్ను చూపని పోరాటతత్వం కలిగిన వారు తెలంగాణ ప్రజలు, తెలంగాణ ఉద్యమం ఒక ఉదాహరణ. అలాగే తమ కోసం పాటుపడే ప్రాంతీయ పార్టీలనుకూడా ఆదరిస్తారు ప్రస్తుతం తెలంగాణలో అన్ని జాతీయ పార్టీలే టిఆర్ఎస్ కూడా బిఆర్ఎస్ గా మారి ప్రాంతీయతత్వాన్ని కోల్పోయింది. అడపాదడపా ప్రాంతీయ పార్టీలు ఉన్న ప్రజల్లో పెద్దగా గుర్తింపు రాలేదు.

**మంచో చెడో మనోడే ఉండాలి**

కేవలం ప్రాంతీయ ప్రయోజనాలకోసం మాత్రమే తెలంగాణ ప్రజలు టిఆర్ఎస్ పార్టీని ఆదరించారు, మొదటిసారి ఇచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చకపోయినా కేవలం ప్రాంతీయతపై మక్కువతో మంచో చెడో మనోడైతే బాగుంటుందని మరొక్కసారి టిఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చారు తెలంగాణ ప్రజలు. కానీ ప్రజలు ఆశించిన స్థాయిలో ఫలితాన్ని చూపించలేకపోయారు అంతేకాకుండా ఇక్కడి సమస్యలను పక్కకు పెట్టి పక్క రాష్ట్రాలమీద దృష్టి పెట్టారు. మన తెలంగాణలో మనదే రాజ్యం అంటే ప్రజలు నమ్మింరు అదేవిధంగా జాతీయ పార్టీ మనకు సహాయం చెయ్యడంలేదు అ కుర్చీ కూడా మనదే అయితే మన తెలంగాణ రాష్ట్రం బాగుపడుతుంది మనమే అందరికి ఇచ్చే స్థానంలో ఉంటాం అని నమ్మించే ప్రయత్నం చేశారు, కానీ ఇక్కడ ప్రజలకు ఏం చేశారనేది వెనక్కిదిరిగి చూడలే. దేశవ్యాప్తంగా డిజిటల్ మీడియాని ఉపయోగించి టాప్ లో తెలంగాణ ఉంది అని ప్రచారం ఊదరగొట్టడం షూరు చెయ్యగానే తెలంగాణ ప్రజలు ఆలోచనలో పడ్డరు మీడియాలో ఊదరగొడుతున్నంత మాకేమి కనిపిస్తలేదుకాదా అని..విషయం వీక్ గా ఉన్నపుడే పబ్లిసిటీ పీక్ గా ఉంటుందనే విషయం అర్థమైంది. కన్న తల్లిని కాదని పిన్నమ్మకు బంగారు గాజులు చేయించినట్టు సొంత రాష్ట్రంలో నష్టాలను గాలికొదిలి పక్కరాష్ట్రం రైతులకు సహాయ నిమిత్తం పైసలు పంపడాన్ని తెలంగాణ ప్రజలను ఒకింత ఆశ్చర్యాన్ని కలిగించింది , అలాంటి చర్యలతో దేశమంతా తెలంగాణ రాష్ట్రం వైపు చూడాలని తెలంగాణ రాష్ట్రం గొప్పగా ఉందని చర్చ జరగాలని చూశారు కానీ అసలుకే ఎసరైనట్టు తెలంగాణ ప్రజలు ఆలోచించడం మొదలు పెట్టారు.

**ఫక్తు రాజకీయ్యాలే..**

తెలంగాణ అంటే కవులు,కళాకారులు,విద్యార్థులు,ఉద్యోగులు, సకలజనులు.., కానీ ఇవన్నీ మరిచిపోయిన టిఆర్ఎస్..బిఆర్ఎస్ గా మార్పు చెందింది రాష్ట్ర సాధనలో పాటుపడ్డ ఉద్యమకారులు సహాయంకోసం ఎక్కడికి వెళ్లిన అవహేళనకు గురయ్యారు ఏ లీడర్ దగ్గరికిపోయినా "చల్ ఇంకెక్కడి ఉద్యమకారుల్ వ్య" అని వ్యంగంగా మాట్లాడటం అందరినీ కదిలించింది ఆలోచింపజేసింది, న్యాయం చేయమని అడిగితే ఒక్క బిఆర్ఎస్ మాత్రమే ఉందా ఉద్యమకారులకు న్యాయం చెయ్యడానికి ఇపుడిది ఉద్యమ పార్టీ కాదు ఫక్తు రాజకీయ పార్టీ అనడం తెలంగాణలో ఏ ఉద్యమకారుడికి నచ్చలేదు. "మాకు కానీ మావోడు మాకెందుకు" అనుకి సకలజనుల తోడు లేకపోతే తమ స్థాయి ఏంటో బీఆర్ఎస్ అధిష్టానానికి గుర్తు చేశారు తెలంగాణ ప్రజలు. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినంత పనయింది. కానీ ఆ పార్టీ అధిష్టానం మాత్రం ఓటమిని బేరీజు వేసుకుని ముందుకు వెళ్లడానికి సిద్ధంగా లేకపోవడం, మేము కాదు ప్రజలే ఓడిపోయారనే ప్రచారం తమ మీడియా ద్వారా చెయ్యడం ఇతర రాజకీయ పార్టీలకు బలాన్ని చేకూర్చింది. తమకోసం పాటుపడిన వారికి సరైన గుర్తింపు ఇవ్వడంలో కెసిఆర్ పార్టీ విఫలమైంది.

**లలిత టు కవిత**

ప్రతి గెలుపు హేళనతో మొదలవుతుంది అనడానికి చాలా ఉదాహరణలు ఉన్నాయి, రాజకీయ రంగంలో అవహేళనకు గురై ఆత్మాభిమానం కోసం పోరాడిన చాలామంది మంచి స్థాయిలో నిలిచారు ఉదాహరణకు జయలలిత నుండి కెసిఆర్ వరకు, వైయస్ జగన్, రేవంత్ రెడ్డి ఇలా చెప్పుకుంటు పోతే చాలామంది నాయకులు ప్రజల మన్నలను పొందారు. లిక్కర్ కేసులో జైలుకెళ్లిన కల్వకుంట్ల కవిత వెయ్యి ఏనుగుల బలంతో బయటికి వచ్చి తన స్వరాన్ని ఘనంగా వినిపించింది, సాధారణంగా కొటరిలున్న బిఆర్ఎస్ పార్టీలో ఆది కొందరికి మింగుడు పడలేదు, వాస్తవాలు మాట్లాడటం తాము అధికారంలో ఉన్నప్పుడు జరిగిన తప్పులెంచడం పార్టీ అధిష్టానానికి ఆగ్రహం కలిగించింది దీంతో పార్టీనుండి సస్పెండ్ అయిన కవిత ఇంకా బలంగా నిలబడాలనుకున్న తరుణంలో ప్రజా సమస్యలపై పోరాటం మొదలు పెట్టి ప్రజలవద్దకు యాత్రలు మొదలు పెట్టారు. కొత్తపార్టీ వైపు అడుగులేస్తున్న కవితకను నమ్మి తెలంగాణ ప్రజలు మరోసారి తమకు అవకాశం ఇవ్వాలంటే చాలా కష్టపడాల్సి ఉంటుంది, కొంత ప్రాంతీయత ఫార్ములా వర్కౌట్ చేసినా ఉద్యమకారుల అండకూడా చాలా ముఖ్యం. నిజానికి 2009 నుండి 2014 మధ్యకాలంలో కాలేజీల్లో, యూనివర్సిటీల్లో విద్యార్థి దశలో ఉన్న ప్రతి ఒక్కరు ఉద్యమాకారులే..తెలిసి తెలియని వయసులో నిస్వార్థంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగస్వాములు అయ్యారు, ఇంకొందరు అమరులయ్యారు...వీరందరికీ భరోసా కల్పించగలిగితే దగా పడ్డ ఉద్యమకారులకు అండగా నిలబడితే తెలంగాణలో కవిత పార్టీ బలపడే అవకాశం లేకపోలేదు, కానీ అదే కుటుంబం నుంచి వచ్చిన కవితను మళ్లీ నమ్మడానికి కొంత సమయం పట్టొచ్చు. కల్వకుంట్ల కవిత కూడా తెలంగాణ మలిదశ ఉద్యమకారుల విషయంలో ఇంతకుముందు గులాబీ పార్టీ వ్యవహరించిన తీరును పునరావృతం చేస్తే మాత్రం తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబానికి నూకలు చెల్లినట్లే. ఎద్దైమైన అధికార పక్షానికి ప్రతిపక్షానికి దీటుగా ఒంటరిగా పోరాడుతున్న తీరు ప్రజల్లో కొంత సానుభూతిని కూడా కలిగిస్తూ ఉంది...కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరు తర్వాత అధికారంలోకి తామే ఉంటామని ఊదరగొట్టడం సహజం, కానీ కల్వకుంట్ల కవిత మాత్రం అందుకు భిన్నంగా రెండవ టర్మ్ తర్వాత తాను బలంగా నిలబడతామని అనడంతో మంచి ప్రణాళికతోనే ముందుకు వెళుతుందనే ఆలోచన ప్రజల్లో కలిగించింది. తనను నమ్మి వచ్చిన వారిని సరైన మార్గంలో నడిపించే బాధ్యత తాను తీసుకుంటే చాలా మంది అవకాశం కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు యువకులు కళాకారులు కవితకు తోడుగా నిలబడే అవకాశం లేకపోలేదు.



## గొల్లపల్లిలో పోషణ పక్వాడి కార్యక్రమం నిర్వహణ

బెస్ట్ వాయిస్, రేవల్లి వనపర్తి :

వనపర్తి జిల్లా గొల్లపల్లి గ్రామ అంగన్వాడి కేంద్రంలో శనివారం పోషణ పక్వాడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందజేశారు. చిన్నారులకు బూస్టర్ డోస్ టీకాలు, చుక్కల మందు, విటమిన్ఏ అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పగడాల సంతోషమ్మ, ఏఎన్ఎం, అంగన్వాడి టీచర్, ఆశా వర్కర్, మహిళలు పాల్గొన్నారు.




## అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వనపర్తిలో శాంతి ర్యాలీ

బెస్ట్ వాయిస్, రేవల్లి వనపర్తి :

అమెరికా సామ్రాజ్యవాదంతో ప్రపంచ మానవ మనుగడకే ముప్పు ఏర్పడిందని, శాంతికాముకులు ఐక్యంగా పోరాడాలని ఏఐపిఎస్ఓ, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. శనివారం వనపర్తిలో అంబేద్కర్ చౌక్ నుంచి రాజీవ్ చౌక్ వరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. "యుద్ధం వద్దు-శాంతి ముద్దు", "ప్రపంచ శాంతి వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సభలో నేతలు మాట్లాడుతూ అమెరికా యుద్ధ రాజకీయాల వల్ల అనేక దేశాలు నాశనమయ్యాయని ఆరోపించారు. యుద్ధాలు ఆగితేనే మానవ అభివృద్ధి సాధ్యమని, ప్రపంచ దేశాలు ఏకమై శాంతి పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.



## ఓపెన్ హార్ట్ సర్జరీ బాధితునికి అండగా నిలిచిన పెగళ్ళపాటి లక్ష్మీనారాయణ

బెస్ట్ వాయిస్,గీసుకొండ:

గీసుకొండ మండల కేంద్రానికి చెందిన షేక్ అంకూస్ పాషా షరీఫ్ అనే నిరుపేద వ్యక్తి, వృత్తి రీత్యా ఆటోడ్రైవర్ రెండు నెలల క్రితం హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పటల్ లో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతని దయనీయ పరిస్థితిని గమనించిన అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్,గీసుకొండ గ్రామ శ్రీమంతుడు గా ప్రసిద్ధి గాంచిన పెగళ్ళపాటి లక్ష్మీనారాయణ మానవత్వంతో స్పందించి రూ5000/ ల ఆర్థిక సహాయాన్ని పంపగా అట్టి నగదును గీసుకొండ సోషల్ సర్వీస్ టీం ప్రతినిధులు కర్ణకంటి రాంమూర్తి, ముల్క సత్యనారాయణ, మహ్మద్ సోనీ, కత్తి వెంకటేశ్వర్లు మరియు బోడకుంట్ల ప్రభాకర్ బాధితునికి అందజేయడం జరిగింది. ఆపదలో ఉన్న తమకు అండగా నిలిచిన పెగళ్ళపాటి లక్ష్మీనారాయణ కు అంకూస్ పాషా ధన్యవాదాలు తెలిపారు.

# రెజీనా ఎమోషనల్ పోస్ట్ వైరల్!



తెలుగులో 'పిల్లా నువ్వు లేని జీవితం', 'సుబ్రహ్మణ్యం ఫర్ సేల్' వంటి సినిమాలతో మెప్పించిన అందాల భామ రెజీనా కాసాండ్రా. ప్రజంట్ తెలుగులో అవకాశాలు తగ్గడంతో కోలివుడ్ లో, బాలీవుడ్ లో బిజీగా గడుపుతోంది. మూకుతి అమ్మన్ 2 నయనతారతో కలిసి ఈ సీక్వెల్‌లో నటిస్తున్న రెజీనా. అలాగే 'ఫ్లాష్‌బ్యాక్' అనే తమిళ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. సెక్షన్ 108 మూవీ హిందీలో నవాజుద్దీన్ సిద్ధిఖీ సరసన నటిస్తున్నారు. అయితే మూవీస్ విషయం పక్కన పెడితే.. తాజాగా తన ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆలోచనలో పడేశాయి. తన 20 ఏళ్ల సినీ కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులను చూసిన ఈ భామ, వ్యక్తిగత జీవితం, ప్రేమలోని లోతు గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. రెజీనా తన పోస్ట్‌లో ప్రేమ గురించి వివరిస్తూ.. 'ఒకరోజు నన్ను నేను ప్రేమకు పూర్తిగా అప్పగించుకున్నాను. చాలామంది పరిస్థితులకు లొంగిపోవడాన్ని నిస్సహాయత అనుకుంటారు, కానీ ప్రేమ అనేది ఒక నిశ్శబ్ద శక్తి. మనం ప్రేమించబడటానికి అర్హులమని గుర్తుంచుకోవడానికి ప్రతి రోజూ ఒక మంచి రోజే. ప్రేమించడం, ప్రేమించబడటంలోనే నిజమైన ఆనందం ఉంది. దాన్ని కోల్పోయినప్పుడు కలిగే బాధ ఎలా ఉంటుందో మనకు తెలుసు కాబట్టే, ఆ అనుభూతిని తేలికగా తీసుకోకూడదు' అని పేర్కొన్నారు.

Printed, Published & Owned by Kowdagani Jyothi Printed at VM Printers H.No. 8-10-37, Radhika Theatre, Warangal.Telangana- 506002. Published at # 16-1-558/2 SRR Thota,Kareemabad, Warangal. Telangana -506002. Editor: Kowdagani Mohan Rao, RNI No.TELTEL/2016/68994. Cell:9963334550, email: bestvoicenews@gmail.com